క్లుప్తంగా

దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభం



పూజలందుకుంటున్న దుర్గాదేవి

జి.సిగడాం: మధుపాంలో దుర్గాదేవి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ముక్కనుమ రోజున ఉత్సవాలు ప్రారంభించి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముమ్మరంగా భూసర్వే



సంతసీతారాంపురంలో సిద్ధంగా ఉన్న సర్వే రాళ్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో విడతల వారీగా వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు సర్వే జరుగుతోంది. దీనిలో భాగంగా హద్దు రాళ్లను ప్రభుత్వం గ్రామాలకు సరఫరా చేస్తోంది. ముందుగా డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించి అనంతరం రెవెన్యూ రికార్డుల ఆధారంగా సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ఓలేటి అగ్రహారం, ఇబ్రహీంబాద్, ఎస్ఎంపురం పేట, భగీరథపురం తదితర ప్రాంతాల్లో సర్వే పూర్తిచేసినట్లు తహశీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు.

ముగిసిన గురమ్మ పేరంటాలు జాతర



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

లావేరు: మండలంలోని గుర్రాలపాలెంలో ఈ నెల 15 నుంచి జరుగుతున్న గురమ్మ పేరంటాలు జాతర మంగళవారంతో ముగిసింది. ఉత్సవాల సందర్భంగా ప్రతి ఇంటి నుంచి ఘటాలను తీసుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా వచ్చి పేరంటాలుకు బోనాలు సమర్పించారు. చీరలు చూపి, పసుపు, కుంకుమలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరింపజేశాయి. స్థానికులతో పాటు లావేరు, రణస్థలం, పొందూరు మండలాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.

క్రీడాపోటీల విజేతలకు బహుమతులు



విజేత జట్లకు షీల్డ్‌లు అందజేస్తున్న అప్పలనాయుడు

రణస్థలం: మండలంలోని కొండములగాం పంచాయతీలో సంక్రాంతి సంబరాల సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకులు గొర్లె అప్పలనాయుడు ఏర్పాటు చేసిన వాలీబాల్, క్రికెట్ టోర్నీలు మంగళవారంతో ముగిశాయి. హోరాహోరీగా సాగిన క్రికెట్ పోటీలో ముక్తుంపురం జట్టు విజేతగా, పతాంజలి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో బ్యాడ్ హ్యాబిట్స్ టీమ్ విన్నర్‌గా, ఎస్సీ కాలనీ రన్నర్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లకు అప్పలనాయుడు చేతుల మీదుగా షీల్డ్, నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కొండములగాం సర్పంచ్ గొర్లె మంజూలాదేవి, గ్రామపెద్దలు గొర్లె వెంకటరమణ, చైతన్యనాయుడు, యువత పాల్గొన్నారు.

నేడు వల్లభ నారాయణుడి రథోత్సవం



వల్లభ నారాయణస్వామి

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా గ్రామంలో వెలసిన వల్లభ నారాయణస్వామి రథోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 3 గంటలకు పంచామృత అభిషేకంతో మొదలై ఉదయం 6 గంటలకు సర్వదర్శనాలు, మధ్యాహ్నం అన్న సమారాధన, కూడు బళ్ల ఉత్సవం, సాయంత్రం గౌరమ్మ తల్లికి ముర్రాటలతో చల్లదనం, కోలాట ప్రదర్శన, రాత్రి 10 గంటలకు ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా భద్రమహంకాళీ జాతర



పూజలందుకుంటున్న భద్రమహంకాళి



ముర్రాటలతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జాతర పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రణస్థలం మండలం కోటపాలెంలో కొలువైన ఉత్తరాంధ్ర కల్పవల్లి భద్రమహంకాళీ అమ్మవారి జాతర ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ సారథ్యంలో జరిగిన ఈ వేడుకలకు సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నాడు వేలాది మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, మాజీ జెడ్పీటీసీ గొర్లె రాజగోపాల్, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, లంక కృష్ణంనాయుడు, మహంతయ్య తదితరులు పాల్గొన్నారు.

– రణస్థలం

తిరుగు ప్రయాణాలు ప్రారంభం



శ్రీకాకుళం అర్బన్: నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరిన ప్రయాణికులు



జి.సిగడాం: బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

శ్రీకాకుళం అర్బన్/జి.సిగడాం: సంక్రాంతి పండగ సెలవులు ముగియనుండడంతో సుదూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన బంధువులు, చుట్టాలు, కుటుంబ సభ్యులు తిరుగు ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, వలసజీవులు మరలా వారి ఇంటికి, కళాశాలలకు బయలుదేరేందుకు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. దీంతో బస్సులు రద్దీగా కనిపించాయి. నాన్‌స్టాప్ కౌంటర్ ప్రయాణికులతో కిటకిటలాడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పల్లెవెలుగు బస్సులను సైతం నాన్‌స్టాప్ బస్సులుగా నడిపారు. జి.సిగడాం మండలం సంతవురిటి, పాలఖండ్యాం, ఆనందపురం, వాంద్రంగి, డి.ఆర్.వలస, సర్వేశ్వరపురం కూడళ్లు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.

ఎండు చేపలతో ఆదాయం



డి.మత్స్యలేశంలో ఎండు చేపలు పోగు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎండు చేపలు మత్స్యకారులకు మంచి ఆదాయాన్ని ఇస్తున్నాయి. వేటాడే సమయంలో ఎక్కువగా చిన్న చేపలు పడితే వీటిని ఎండబెట్టి విక్రయిస్తుంటారు. ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెం పంచాయతీల పరిధిలో 12 వరకు మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఎండు చేపలు ఆరబెట్టేందుకు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. అమ్మకానికి, ఎగుమతులకు సాధ్యం కాని జాతుల చేపలను ఇక్కడ ఎండి బెట్టి అమ్ముతారు. డిమాండ్ బట్టి రూ. 200 నుంచి రూ.250 వరకు ధర పలుకుతాయి.

ప్రత్యేక అలంకరణలో విజయగణపతి



పూజలందుకుంటున్న విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో స్వామివారిని ముక్కనుమ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పెంట సూర్యనగేష్‌శర్మ, శ్రీధర్ శర్మల ఆధ్వర్యంలో సామివారికి బంతిపూలు, చామంతులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

రథసప్తమి ఏర్పాట్లపై సమావేశం నేడు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 27 అర్ధరాత్రి నుంచి 28 రాత్రి వరకు జరగనున్న రథసప్తమి ఉత్సవ నిర్వహణపై బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి అనివెట్టి మండపంలో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా ఏర్పాట్లు జరుగుతున్న క్రమంలో భక్తులకు సౌకర్యవంతంగా దర్శనాలకు తగిన చర్యలపై కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ తదితర శాఖాధికారులతో సమన్వయం చేసేలా సమావేశం జరగనుందని పేర్కొన్నారు.

అంతర పంటల సాగుతో ఆదాయం



కేశవరాయునిపురంలో ఉల్లి పంటలో అంతరపంటగా బొప్పాయి సాగు

లావేరు: మండలంలోని పలు గ్రామాల రైతులు అంతర పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఒకే భూమిలో ఒకే పంట వేసేకన్నా అంతర పంటలు వేయడం లాభదాయకంగా ఉండటంతో అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కేశవరాయునిపురం, లావేటిపాలెం, లావేరు, గోవిందపురం, ఇజ్జాడపాలెం, లింగాలవలస, పోతయ్యవలస తదితర గ్రామాల్లో ఉల్లి పంటలో బొప్పాయి, గుమ్మడి, కర్బూజ పంటలు, కొబ్బరి తోటల్లో కర్బూజా, గుమ్మడి, కూరగాయలు వంటివి అంతరపంటలుగా సాగుచేస్తున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండటమే కాకుండా కలుపు బెడద తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పేదలకు దుప్పట్ల వితరణ



అప్పాపురంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

లావేరు: మండలంలోని అప్పాపురం పంచాయతీ సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జగ్గురోతు సత్యనారాయణ కుటుంబ సభ్యులు మంగళవారం గ్రామంలో 450 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏటా సంక్రాంతి సమయంలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్నట్లు దాతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగ్గురోతు కనకరాజు, జగ్గురోతు గోవిందరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: సంక్రాంతి సందర్భంగా అరసవల్లి శ్రీసూర్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సుమారు 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కూర్మనాథస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు చేతులమీదుగా పట్టణంలోని పలు కూడళ్ల వద్ద మంగళవారం వీటిని వితరణ చేశారు.

కాలువపై కట్టడాలు..

అందని సాగునీరు



పీడబ్ల్యూడీ గట్లపై హద్దురాళ్లు వేసిన దృశ్యం



కాలువపై కట్టిన ప్రహరీ

శ్రీకాకుళం రూరల్: మండలంలోని ఫాజుల్‌బాగ్‌పేట రెవెన్యూ పరిధి సీపన్నాయుడుపేట-బైరివానిపేట గ్రామ సరిహద్దుల్లో పీడబ్ల్యూడీ కాలువ సర్వే నెంబర్ 45-5లో కొంతమంది ఆక్రమణదారులు హద్దులు వేస్తూ ఆక్రమణలకు పాల్పడటంతో పంట పొలాలకు సాగునీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో అపరాలు, ఇతరత్రా పంటలు సాగుచేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమని ఆక్రమణదారులను ప్రశ్నించగా బెదిరింపులకు పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఎకరా విస్తీర్ణంలో కాలువ ఆక్రమణకు గురికాగా మరికొంతమంది ఏకంగా కాలువ భూములను సమాంతరంగా చేస్తూ వాటిపై ప్రహరీలు కట్టేస్తూ నీరు రాకుండా చేస్తున్నారని పరిసర ప్రాంత రైతులు వాపోతున్నారు. ప్రధానంగా కాలువ గట్లపైనే హద్దులు వేస్తూ ఆక్రమణలు చేయడంతో నడిచేందుకు కూడా దారి లేకుండా పోతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గట్లపై ఆక్రమణలు..

పీడబ్ల్యూడీ కాలువ గట్లుపై ఆక్రమణలు ఉన్నాయి. బైరివానిపేట, సీపన్నాయుడుపేట గ్రామాల గుండా రెవెన్యూ సిబ్బంది సర్వే చేస్తే పిడబ్ల్యూడీ కాలువ చాలా వరకూ ఆక్రమణలో ఉన్నట్లు తేటతెల్లమవుతుంది. పొలాలకు నీరు అవకాశం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– రాజు, పీఎస్ కాలనీ

కాలువలను పరిశీలిస్తాం

పీడబ్ల్యూడీ కాలువపై ఎటువంటి ఆక్రమణలు ఉన్నా తొలగిస్తాం. రైతులు పంట పొలాలకు నీరు అందేలా చూస్తాం. సిబ్బందితో కలిసి సర్వేచేస్తాం. ప్రభుత్వ భూముల్లో గానీ, పీడబ్ల్యూడీ గెడ్డ గట్లపై ఎటువంటి ఆక్రమణలు కొనసాగించినా చట్టపరమైన చర్యలు తప్పవు.

– ఎన్.వెంకట్రావు, శ్రీకాకుళం రూరల్ తహశీల్దార్

బీచ్ కబడ్డీ పోటీల విజేత శ్రీకాకుళం

ఒంగోలు రూరల్: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఒంగోలు రూరల్ మండలం కరవది వేదికగా ఈ నెల 15, 16, 17 తేదీల్లో నిర్వహించిన జాతీయ మహిళా బీచ్ కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. మంగళవారం రాత్రి నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడగా శ్రీకాకుళం టీమ్ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో విశాఖపట్నం, తృతీయ స్థానంలో విజయ నగరం, నాలుగో స్థానంలో గుంటూరు, ఐదో స్థానంలో ప్రకాశం, ఆరో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

పండగ వేళ..

రహదారులు వెలవెల



సూర్యమహల్ జంక్షన్



ఏడురోడ్ల కూడలి



కళింగ రోడ్డులో ఇలా..

సంక్రాంతి నాడు కళకళలాడిన శ్రీకాకుళం నగరం కనుమ, ముక్కనుమ పండగల వేళ మాత్రం వెలవెలబోయింది. చాలా మంది దూరప్రాంతాలకు వెళ్లిపోవడంతో నగరంలోని రోడ్లు బోసిపోయాయి. నిత్యం రద్దీగా ఉండే ఏడు రోడ్ల కూడలి, సూర్యమహల్ జంక్షన్, డేఅండ్‌నైట్ కూడళ్లలో షాపులు సైతం మూతపడటంతో రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి.

– శ్రీకాకుళం కల్చరల్